

చనిపోయిన వ్యక్తికి రుణం

చనిపోయిన వ్యక్తికి ఖమ్మంలోని కోటక్ మహీంద్రా బ్యాంకు బుల్లెట్ బండి రుణం మంజూరు చేసింది. - 8లో▸



సదస్సుల వేదిక.. నిట్

నిట్ వరంగల్ క్యాంపస్ పలు జాతీయ, అంతర్జాతీయ సమావేశాలు, సదస్సులకు వేదిక అవుతోంది. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$42^0/32^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. రాత్రి సమయంలో ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ స్పోర్ట్స్/కాశిబుగ్గ: వివిధ రంగాల్లో విశిష్ట సేవలు చేసిన వారికి పద్మ అవార్డులు అందించేందుకు భారత ప్రభుత్వం జనవరి 26, 2025కుగానూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ, వరంగల్ జిల్లాల యువజన, క్రీడల అధికారులు గుగులోత్ అశోక్‌కుమార్, సత్యవాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. https://padmaawards.gov.in ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు చేసిన సేవలకు సంబంధించిన వివరాలు, పేపర్ క్లిప్పింగులు, ఫొటోలతో సహా(03) సెట్లు తయారు చేసి జూన్ 3, 2024 తేదీలోపు హనుమకొండ జిల్లాకు చెందిన వారు హనుమకొండ జిల్లా ప్రభుత్వ కాకతీయ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో స్వయంగా అందజేయాలని కోరారు. వరంగల్‌కు చెందిన వారు ఓ సిటీలోని జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో అందజేయాలని కోరారు. గడువు ముగిసిన తర్వాత వచ్చిన దరఖాస్తులు తిరస్కరిస్తామని వారు తెలిపారు.

నాలా పనులను వేగవంతం చేయాలి



కాజీపేట: రాజాజీనగర్ నుంచి బొక్కలగడ్డ వరకు ఎలాంటి అక్రమ నిర్మాణాలు ఉన్నా వెంటనే తొలగించాలని, నయీంనగర్ నాలా పనులను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం రాత్రి నాలా పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు నాలా పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రానున్న వర్షాకాలాన్ని పరిగణనలోకి తీసుకుని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె సూచించారు. సమావేశంలో గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీఓ వెంకటేష్, ఈఈ రాజయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరంగల్ ఫోర్ట్ ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

కాజీపేట అర్బన్: వరంగల్ ఫోర్ట్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న రాజేశ్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ శనివారం రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ డీఐజీ సుభాషిణి ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నాన్ లేఅవుట్ ప్లాట్లను అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడ్డారనే ఆరోపణల్ని విచారించి సెస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్తీక్ సెలవుల్లో ఉండడంతో డీఐజీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజేశ్‌ను ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా అధికారులు నియమించారు.

'ముడుపులు అవాస్తవం'

కాజీపేట అర్బన్: జిల్లా గిరిజన అభివృద్ధి అధికారికి వసతి గృహ సంక్షేమాధికారులు, హెడ్ మాస్టర్లు ముడుపులు చెల్లించినట్లు వస్తున్న ఆరోపణలు అవాస్తమని వసతి గృహ సంక్షేమాధికారులు, హెడ్ మాస్టర్లు తెలిపారు. హనుమకొండ జిల్లాలోని గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శనివారం వసతి గృహ సంక్షేమాధికారులు, హెడ్ మాస్టర్లు మాట్లాడుతూ.. హనుమకొండ, జనగామ జిల్లాల పరిధి వసతి గృహ సంక్షేమాధికారులు, హెడ్ మాస్టర్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి అందుబాటులో ఉన్న అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అదనపు బాధ్యతలు నిర్వహించడం భారమైనా నిర్వహిస్తున్నామని, ఇందుకు ముడుపులు చెల్లించడం అవాస్తమని తెలిపారు. జిల్లా అధికారి తమపై ఎలాంటి ఒత్తిడికి గురి చేయడం లేదన్నారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారులు, హెడ్ మాస్టర్లు జ్యోతి, కృష్ణ, తిరుమల, విజయలక్ష్మి, రజిని, రమాదేవి, రాజారావు, శంకర్‌కుమార్, అలీ, కోమల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో 328 మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో శనివారం నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 328 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ గోపాల్ తెలిపారు. ఉదయం నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్లో జనరల్, ఒకేషనల్ కలిపి 2,451 మంది విద్యార్థులకుగాను 2,176 మంది హాజరైనట్లు, 275 మంది గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో జనరల్, ఒకేషనల్ కలిపి 277 మంది విద్యార్థులకుగాను 224 మంది హాజరైనట్లు తెలిపారు.

ప్రచారానికి తెర!

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పట్టం ఎవరికో? ● ఆఖరి రోజు హోరెత్తిన ప్రచారం

- గ్రాడ్యుయేట్లను ఆకట్టుకునేందుకు మూడు పార్టీల వ్యూహాలు
- ఈ ఉప ఎన్నికలో వరంగల్ పట్టభద్రులదే కీలక పాత్ర
- అమల్లోకి పోలీస్ నిషేధాజ్ఞలు.. మద్యం షాపులకు సీల్
- రేపు పోలింగ్.. అధికారుల ఏర్పాట్లు

సాక్షిప్రతినిధి, వరంగల్:

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రం తెరపడింది. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీన.. ఆఖరి రోజున ప్రచారాన్ని హోరెత్తించాయి. అభ్యర్థులతోపాటు పలువురు నేతలు గడువు ముగిసే వరకు పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. సభలు, సమావేశాలు నిర్వహించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో 52 మంది పోటీలో ఉండగా.. ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్రులు కూడా ఈసారి గట్టిగానే ప్రచారం చేశారు. ఈ నెల 27న (సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుండగా.. శనివారం సాయంత్రమే ప్రచారాన్ని ముగించిన అభ్యర్థులు పట్టభద్రులను ప్రసన్నం చేసుకోవడంలో నిమగ్నమయ్యారు.

హోరాహోరీగా ప్రచారం.. ఓటర్లపైనే భారం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో గెలవడం కోసం అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. ప్రధానంగా ఏనుగుల రాకేశ్‌రెడ్డి (బీఆర్ఎస్), తీన్మార్ మల్లన్న (కాంగ్రెస్), గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి (బీజేపీ) తరఫున ఆయా పార్టీల అగ్ర నాయకత్వం తమదైనశైలిలో గట్టిగా కృషి చేసింది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు, పట్టభద్రులు ఆయా పార్టీల అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. శనివారం సాయంత్రం ప్రచారం ముగియడంతో తమ అనుచరులు, కార్యకర్తలతో టీములుగా ఏర్పాటు ఓటర్లను ప్రసన్నం చేసే పనిలో పడ్డారు. కాగా 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికను పురస్కరించుకుని మొత్తం 5,05,565 ఓట్లుండగా.. తాజాగా తుది జాబితాలో 4,61,806 మంది ఓటర్లున్నారు. గతంతో పోలిస్తే 43,759 ఓట్లు తగ్గాయి. ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికకు పట్టభద్రులు ఓటుహక్కును వినియోగించుకోవాల్సి ఉంది. జూన్ 5న లెక్కింపు ప్రక్రియతో విజేతల వివరాలు వెల్లడించనుండగా.. హోరాహోరీప్రచారం చేసిన అభ్యర్థులు ఇప్పుడు ఇక ఓటర్లపైనే భారం అంటున్నారు.

ప్రచారం ముగిసింది... పంపిణీ సాగుతోంది

అభ్యర్థుల గెలుపు కోసం రెండు, మూడు ప్రధాన పార్టీల నాయకులు విచ్చలవిడిగా ధన ప్రవాహానికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ప్రచారంలో చేసిన ఖర్చుకు అదనంగా ఒక్కో ఓటుకు రూ.500 నుంచి రూ.2,000ల చొప్పున వెచ్చిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎంతలేదన్నా ఇప్పటి వరకు ఖర్చు చేసిన దానికి అదనంగా ఈ రెండు రోజుల్లో మరో రూ.5 నుంచి 10 కోట్ల వరకు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే తమకు ఓట్లు పడతాయనే ప్రాంతాల్లో చోటా నేతలకు నగదును రహస్యంగానే అందజేశారు. ఈ చోటా నేతలు ఎన్నికల సంఘం కళ్లుగప్పి విచ్చలవిడిగా పోల్ చిట్టీలతోపాటు డబ్బుల్ని పంపిణీ చేసేలా నాయకులు ఏర్పాట్లు చేసినట్లు చెబుతున్నారు. తమకు అనుకూలంగా లేని, ఓట్లు పడవేమో అనుకున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.



కేయూ విభాగాల్లో ఓట్లు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి



కేయూ లైబ్రరీలో కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

అమల్లోకి 144 సెక్షన్.. వైన్స్ మూసివేత

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయంనుంచి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి 28వ తేదీ ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఎవరైనా నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కాగా బ్రాందీషాపులు, బార్లను ఆబ్కారీశాఖ అధికారులు శనివారం సాయంత్రం మూసివేశారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని అన్ని చోట్ల పోలింగ్ ముగిసిన తర్వాత మళ్లీ తెరవనున్నారు.

ఎమ్మెల్సీ ఓటు వేయండిలా..

- '1' ప్రాధాన్యత అంకె ఇవ్వకుండా మిగతావి ఇస్తే ఆ ఓటు చెల్లదు - 8లో▸

12 గుర్తింపు కార్డులతో ఓటు వేయొచ్చు

వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య

కాశిబుగ్గ సెంటర్ : ఎమ్మెల్సీ ఉపఎన్నికకు పట్టభద్రులు 12 రకాల గుర్తింపు కార్డులతో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డులేని వారు ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, బ్యాంక్, పోస్టాఫీస్ పాస్‌పుస్తకాలు, కార్మిక మంత్రిత్వశాఖ జారీ చేసిన ఆరోగ్యబీమా స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, పెన్షన్ డాక్యుమెంట్, ప్రభుత్వ ఉద్యోగులకు జారీ చేసిన గుర్తింపు కార్డులు, ప్రత్యేక వైకల్యం తదితర గుర్తింపుకార్డుల్లో ఏదో ఒకదానితో ఓటు వేయవచ్చని తెలిపారు. జిల్లాలోని పట్టభద్రుల ఓటర్లు సోమవారం సమయం కేటాయించి ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

27న ప్రత్యేక క్యాజువల్ లీవ్

పట్టభద్రుల ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈనెల 27న ప్రత్యేక క్యాజువల్ లీవ్‌ను ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ప్రకటించారు. ఓటుహక్కు ఉన్న ప్రైవేట్ సంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పనిచేసే పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆయా యాజమాన్యాలు వెసులుబాటు కల్పించాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలు ఉన్న విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఈనెల 26, 27న పెయిడ్ హాలిడేగా పరిగణించాలని తెలిపారు.

చట్ట సభల గౌరవం పెంచే వారినే ఎన్నుకోవాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

హన్మకొండ: చట్టసభల గౌరవం పెంచే వ్యక్తిని శాసన మండలికి ఎన్నుకోవాలని నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మాయగాళ్లు, మోసగాళ్లు చట్టసభలో ఉండకూడదని, బెదిరించే అభ్యర్థి ఎమ్మెల్సీగా గెలిస్తే విద్యా సంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలను, వ్యాపారవేత్తలను ఏం చేస్తారో ఆలోచించాలన్నారు. ప్రభుత్వానికి వత్తాసు పలికే వారిని కాకుండా ప్రభుత్వాన్ని నిలదీసే తనను ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలన్నారు. తాను రైతు బిడ్డనని, కష్టాలు, సమస్యలు ఎలా ఉంటాయో తనకు తెలుసన్నారు. అధికారం కోసం కాదు ఆశయం కోసం పని చేస్తానన్నారు. జీఓ 46 రద్దుకు మడమ తిప్పని పోరాటం చేస్తానన్నారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ఓటర్ల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులు రెట్టింపు ఉత్సాహంతో ఉన్నారన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్, నాయకులు రవీందర్‌సింగ్, కె.వాసుదేవరెడ్డి, తాళ్లపల్లి జనార్దన్, నయీముద్దీన్ పాల్గొన్నారు.

సిద్ధాంతం కోసం పనిచేసేదే బీజేపీ



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి

హన్మకొండ: కమిట్‌మెంట్‌తో, సిద్ధాంతం కోసం పని చేసేది కేవలం బీజేపీ నాయకులే అని ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని బీజేపీ ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి పూర్తి సహకారం లభించకపోవడంతో కేటీఆర్.. బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఫోన్ చేసి మద్దతివ్వాలని కోరుతున్నారన్నారు. బీఆర్ఎస్ నుంచి ప్రాణభయం ఉందని, జైలులో నుంచి బీజేపీ లీగల్ సెల్ నాయకులకు ఫోన్లు చేసి సహాయం పొంది బీజేపీలో చేరిన తీన్మార్ మల్లన్న ఆతర్వాత బీజేపీని, ప్రధానిని, నాయకులను తిట్టిన నీచుడు అని దుయ్యబట్టారు. విశ్వసనీయ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని, పట్టభద్రులు తనను గెలిపించాలని కోరారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. ప్రజలు, పట్టభద్రుల సమస్యలపై పోరాడే గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో బీజేపీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, వరంగల్ పార్లమెంట్ ప్రభారీ మురళీధర్ గౌడ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ తదితరులున్నారు.

ఇక.. వార్డు ఆఫీసర్లే కీలకం

- వారికే పన్ను వసూళ్ల బాధ్యత
- ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లను తప్పించాలని ఆదేశం
- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలక శాఖ

వరంగల్ అర్బన్: కొత్త ఇంటి నంబర్ల జారీ, భవనాలు, అదనపు కట్టడాల రివైజ్డ్‌లో చేతివాటం, బకాయిదారుల నుంచి డబ్బులు వసూలు చేసి సకాలంలో చెల్లించకపోవడం వంటి అవినీతి, ఆరోపణల నేపథ్యంలో.. ఎట్టకేలకు రాష్ట్ర పురపాలక శాఖ ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లపై కొరడా ఝుళిపించింది. ఆస్తి, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు చేసే బాధ్యతల నుంచి తప్పించాలని రాష్ట్ర పురపాలక శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిబంధన అన్ని గ్రేటర్, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల కమిషనర్లకు గత రెండ్రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వరంగల్ బల్దియాలో పని చేస్తున్న 38 మంది ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లను పన్నుల వసూళ్ల నుంచి తప్పిస్తూ అధికారులు ఆదేశాలిచ్చారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులే అధికం

గ్రేటర్ వరంగల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు 85శాతానికి పైగా ఉన్నారు. సుమారు మూడు దశాబ్దాలుగా పర్మనెంట్ ఉద్యోగుల నియమాల్లేవు. శాశ్వత ఉద్యోగులు మరణిస్తే, అనారోగ్యం పాలైతే మాత్రమే వారి పిల్లలను కారుణ్య నియామకాల ప్రక్రియ కొనసాగుతోంది. ఈనేపథ్యంలో నగరం విస్తరించడంతో పర్మనెంట్ కార్మికులు పూర్తి స్థాయిలో లేక అన్ని విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య పెరిగింది. అవినీతి, అక్రమాల్లో సైతం వారి పాత్ర కనిపిస్తోంది. పలు మున్సిపాలిటీల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడడం, ప్రజల నుంచి వీరిపై అభ్యంతరాలు వ్యక్తం కావడం వంటి ఘటనలు వెలుగు చూశాయి. ఏదైనా అవినీతి జరిగితే శాశ్వత ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం, అవసరమైతే సొమ్ము రికవరీ చేయవచ్చు. కానీ.. ఔట్ సోర్సింగ్ బిల్ కలెక్టర్లను విధుల్లో నుంచి తొలగించడం, క్రిమినల్ కేసులు పెట్టడంతో సరిపెట్టాల్సి వస్తోంది. ఈక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించి ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో బల్దియా పరిధిలో పని చేస్తున్న 45 మంది ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లను వసూళ్లకు దూరం పెడుతూ ఆదేశాలు జారీ చేశారు.

సన్నాహాలు..

బల్దియాకు పది నెలల కిందట 38 మంది వీఆర్‌లను బదిలీ చేశారు. వీరితోపాటు ప్రస్తుతం బల్దియాలో 32 మంది శాశ్వత ఉద్యోగులు ఇన్‌చార్జ్ బిల్ కలెక్టర్లుగా పని చేస్తున్నారు. నగరంలో 66 డివిజన్లు ఉండగా.. వారిలో 66 మందిని వార్డు ఆఫీసర్లుగా నియమించి, వీరికి ఆస్తి, నీటి పన్నులు వసూలు చేసే బాధ్యతలను కట్టబెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మిగిలిన నలుగురిని ఈ-సేవా సెంటర్లలో బదిలీ చేసే దిశగా కసరత్తులు చేస్తున్నారు. ఇక ఆర్థిక అంశాల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పాత్ర లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తిచేయాలి



పాఠశాలల అభివృద్ధి పనుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కాశిబుగ్గ సెంటర్ : పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పాఠశాలల అభివృద్ధి పనుల పురోగతిపై డీఈఓ వాసంతి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, పాటు సంబంధిత అధికారులతో శనివారం సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 459 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టగా.. 131 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పాఠశాలల్లో త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె సూచించారు. సమీక్షలో ఇంజనీరింగ్ అధికారులు సంజయ్‌కుమార్, రవికిరణ్, సారంగం, రంగారావు పాల్గొన్నారు.

పచ్చదనం పరిఢవిల్లాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: మహా నగర పరిధి చెరువు కట్టలు, పరిసర ప్రాంతాలు పచ్చదనంతో పరిఢవిల్లాలని, ఆదిశగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో హార్టికల్చర్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. నగర పరిధిలో నీటి వనరుల్ని పరిరక్షించుకోవాలని, ఔషధ గుణాలు/పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే ఎకో ఫ్రెండ్లీ లక్షణాలున్న మొక్కల ఎంపికకు అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నారు. నగర వ్యాప్తంగా 7 నర్సరీల్లో ఈఏడాది మొత్తం మొక్కల లక్ష్యం 5 లక్షలు కాగా.. ప్రస్తుతం నర్సరీల్లో సిద్ధం చేసిన మొక్కలు 1.80 లక్షలు కాగా.. మొత్తం 3.30 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నట్లు ఉద్యానవన అధికారి వివరించారు. సమావేశంలో హార్టికల్చర్ అధికారి రమేశ్, అసిస్టెంట్లు ప్రిన్సి, అశ్విని, ప్రవళిక, అనూహ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు.. ఇప్పుడు అదే తంతు..!



పదోన్నతుల విషయంలో 'ఇరిగేషన్'లో ఇష్టారాజ్యం

- బీఆర్ఎస్ హయాంలో వివాదంగా 'కాళేశ్వరం' ప్రమోషన్లు
- కీలక విభాగాల్లోని ఇంజనీర్లకు దక్కని చోటు
- కొందరికే అవకాశంపై అప్పట్లో అసంతృప్తి
- ప్రస్తుత కాంగ్రెస్ సర్కారులోనూ అదే తీరు
- సీఎంను కలిసేందుకు సిద్ధమవుతున్న ఇంజనీర్లు

సాక్షిప్రతినిధి, వరంగల్:

'వడ్డించే వాడు మనవాడైతే ఏ పంక్తిలో ఉన్నా ఫరవాలేదు' అన్నట్లుగా ఉంది జలవనరుల శాఖలో పదోన్నతులు, పోస్టింగుల వ్యవహారం. ప్రతిభావంతులైన ఇంజనీర్లు ఎందరున్నా 'లాబీయింగ్' చేసే వారినే పదోన్నతులు వరిస్తాయన్న చర్చ ఆ శాఖలో ఎప్పటినుంచో ఉంది. ప్రభుత్వాలు ఏమున్నా ఉత్తర్వులు, మార్గదర్శకాలకు మంగళం పాడేసి కొనసాగిస్తున్న ప్రమోషన్ల తంతు తరచూ వివాదాస్పదమవుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన ఇంజనీర్లకు అగ్జిలరీ ప్రమోషన్(ప్రోత్సాహక పదోన్నతులు)ల పేరిట చేసిన ప్రతిపాదనలు రచ్చరచ్చగా మారాయి. ప్రాజెక్టు ప్రారంభ దశనుంచి ఇన్వెస్టిగేషన్, లైడార్ సర్వే, డిజైన్స్, డ్రాయింగ్స్, ఎస్టిమేషన్, టెండర్లు, అగ్రిమెంట్స్, భూసేకరణ, పర్యవేక్షణ తదితర విభాగాల్లో వివిధ కేడర్ల ఇంజనీర్లు కీలక భూమిక పోషించారు. ఉన్నతాధికారులు ప్రతిపాదించిన ప్రమోషన్ల జాబితాలో ఈ విభాగాలకు చెందిన ఇంజనీరు ఒక్కరూ లేకపోవడంపై అప్పట్లో అసంతృప్తి భగ్గుమంది. తాజాగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన బ్యారేజీలపై ఒక పక్క విచారణ జరుగుతుండగా, మరో పక్క ఎంక్వయిరీ ఎదుర్కొంటున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించడం నీటిపారుదల శాఖలో చర్చనీయాంశమవుతోంది.



కాంగ్రెస్ హయాంలోనూ మారని తీరు..

ప్రభుత్వాలు ఏమున్నా నీటిపారుదలశాఖ (జలవనరుల శాఖ)లోని కొందరు ఉన్నతాధికారులు ప్రభుత్వాధినేతలను తప్పుదోవ పట్టించి తమ, అనుచరుల పనులు చక్కబెడుతున్నారన్న చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు, సూచనలకు భిన్నంగా రెండు నెలల్లో పదవీ విరమణకు దగ్గరున్న ఇంజనీర్‌ను నియమించడంపై దుమారం రేగుతోంది. బ్యారేజీల సమస్యలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) అధ్యయనం చేస్తోంది. ఒక పక్క ఇన్ని రకాల విచారణలు జరుగుతుండగా.. ఇంకోవైపు సుందిళ్ల బ్యారేజీ, పంపుహౌస్ బాధ్యతలను (ఇరిగేషన్ డివిజన్-3, రామగుండం) చూస్తున్న ఈఈ సర్దార్ ఓంకార్ సింగ్‌కు వరంగల్ ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ నెల 22న మెమో జారీ చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. ఇదిలా ఉండగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో చక్రం తిప్పిన కొందరు ఈఈ స్థాయి అధికారులు.. తాజా ప్రభుత్వంలోనూ పైచేయి సాధిస్తుండడాన్ని కొందరు ఇంజనీర్లు జీర్ణించుకోవడం లేదు. అదేవిధంగా అగ్జిలరీ ప్రమోషన్లలో జరిగిన అక్రమాలు, అవకతవకలతోపాటు ప్రాజెక్టు నిర్మాణలోపాలు, బీఆర్ఎస్ హయాంలో కీలకంగా వ్యవహరిస్తున్న సహచర ఇంజనీర్ల బాగోతాల చిట్టాతో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు కొందరు బాధిత ఇంజనీర్లు సిద్ధమవుతుండడం నీటిపారుదల శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

కీలక విభాగాలకు దక్కని చోటు..

కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి సందర్భంగా 150 కి.మీ. పొడవున జల సంపదతో కళకళలాడడానికి ఇంజనీర్ల కఠోర శ్రమ, పట్టుదల కారణమని భావించిన అప్పటి సీఎం కేసీఆర్.. లింక్-1 ఇంజనీర్లతోపాటు లింక్-2 ఇంజనీర్లలో కష్టపడి పనిచేసిన వారికి ప్రోత్సాహకంగా ప్రమోషన్ ఇచ్చి గౌరవించాలని తలపించి ప్రతిపాదనలు కోరారు. ఈ మేరకు ఉన్నతాధికారులు మేడిగడ్డ బ్యారేజీనుంచి బీవీ రమణారెడ్డి (ఈఈ), ఎం.రాజు (ఏఈఈ), అన్నారం బ్యారేజీనుంచి ఎ.యాదగిరి (డీఈఈ), పి.రవిచంద్ర (ఏఈఈ)లు, లింక్ -2 నుంచి నూనె శ్రీధర్ (డీఈఈ) పేర్లు పంపారు. దీంతో ప్రాజెక్టు ప్రారంభం నుంచి కఠోర శ్రమ చేసిన పలు విభాగాలకు చెందిన పలువురిని విస్మరించారన్న అసంతృప్తి చెలరేగింది. కాళేశ్వరం లింక్ -2 సర్కిల్ రూపకల్పన నుంచి రామగుండం డివిజన్ -1 ఏర్పడి, మేడిగడ్డ బ్యారేజ్ నుంచి ఎల్లంపల్లి రిజర్వాయర్ వరకు ప్రాథమిక ఇన్వెస్టిగేషన్ పనులను చేస్తూ లైడార్ సర్వే చేసిన ఇంజనీర్లకు ఒక్కరికి కూడా చాన్స్ ఇవ్వలేదు. కాళేశ్వరం లింక్ -1 ఎస్టిమేట్స్, టెండర్లు, వ్యాప్‌కోస్ నుంచి డిజైన్స్, డ్రాయింగ్, అగ్రిమెంట్ల వరకు పని చేసిన ఇంజనీర్లను పక్కకు పెట్టి మధ్యన వచ్చిన కొందరికి కూడా అవకాశం ఇచ్చారన్న చర్చ జరిగింది. 1992 పీఎస్సీకి చెందిన ఇద్దరు సీనియర్ ఇంజనీర్లను పక్కకు పెట్టి ప్రోత్సాహక ప్రమోషన్ కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిసి వారు నేరుగా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఏఈఈ స్థాయిలో మొదటినుంచి ఎస్టిమేట్స్, డిజైన్స్, టెండర్స్‌లో పాల్గొన్న ఒక్కరికీ ప్రోత్సాహక ఇంజనీర్ల జాబితాలో పేర్లు లేకపోవడం అప్పట్లో దుమారం రేపింది. క్షేత్రస్థాయిలో పనిచేసే ఏఈఈలలో వికలాంగులు భూసేకరణ ప్రధాన భూమిక పోషించినప్పటికి ఒక్కరికి కూడా అవకాశం దక్కకపోగా, ఎవ్వరికి తీసిపోకుండా పురుషులతో సమాన స్థాయిలో రాత్రి 12 గంటల వరకు పనిచేసిన మహిళా ఏఈఈలను విస్మరించడం వివాదాస్పదంగా మారింది.

క్లుప్తంగా

నా పదవి కాలం ముగిసినా కేయూ అభివృద్ధికి కృషి

● మాజీ వీసీ తాటికొండ రమేశ్



కేయూ క్యాంపస్: 'వ్యక్తిగత ప్రయోజనాలకంటే వ్యవస్థ ప్రయోజనాలు ముఖ్యం.. నా పదవీ కాలం ముగిసినా కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి ఒక పౌరుడిగా నిర్మాణాత్మక కృషి అందిస్తానని' కేయూ మాజీ వీసీ తాటికొండ రమేశ్ పేర్కొన్నారు. ఈనెల 21న వీసీగా తాటికొండ రమేశ్ పదవీకాలం ముగిసిన విషయం విధితమే. తన హయాంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలతోపాటు వివిధ అవగాహన ఒప్పందాలు, సదస్సులు, తదితర అంశాలను ప్రస్తావిస్తూ శనివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. తాను వీసీగా బాధ్యతలు చేపట్టాక యూనివర్సిటీకి న్యాక్ ఏప్లస్‌గ్రేడ్ సాధించామన్నారు. 2022–2023లో బడ్జెట్‌లో ప్రభుత్వ నుంచి యూనివర్సిటీకి అదనంగా రూ. 31 కోట్లు రాబట్టగలిగామన్నారు. పీహెచ్‌డీ కేటగిరీ–1, కేటగిరీ– 2 ద్వారా 300మందికి పైగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించామన్నారు. కొద్దిమంది సీట్లు రాని వ్యక్తులు పీహెచ్‌డీ అడ్మిషన్లలో అక్రమాలు జరిగాయని గతేడాదిలో ధర్నాచేసి అనేక రకాలు అవమానించారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇందుకు సంబంధించి విచారణ కమిటీని నియమించిందని, ఆ కమిటీ ప్రవేశాలు పారదర్శకంగా జరిగాయని చెప్పిందని తెలిపారు. యూనివర్సిటీ భూమి గుంట కూడా అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించామన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కారుణ్య నియామకాలు పూర్తిచేశామని తెలిపారు. దేశంలోనే ప్రతిష్టాత్మక ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను మూడు దశాబ్దాల తరువాత యూనివర్సిటీలో నిర్వహించామని వివరించారు. తన హయాంలోనే యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగంలో రాష్ట్రపతి అవార్డుతోపాటు అప్పటి గవర్నర్ నుంచి రాష్ట్రస్థాయి రెడ్‌క్రాస్ సేవా అవార్డు సాధించామని తెలిపారు. కేయూకు 34 వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. యూనివర్సిటీ అభివృద్ధిలో తనకు సహకరించిన అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు ధాన్యవాదాలు తెలుపుతున్నాని మాజీ వీసీ రమేశ్ పేర్కొన్నారు.



సదస్సుల వేదిక.. నిట్



అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియం



బోస్ హాల్

క్యాంపస్‌లో కాన్ఫరెన్స్ హాల్ కాంప్లెక్స్, అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఏర్పాటు

- సమావేశాలకు మొగ్గుచూపుతున్న ఔత్సాహికులు
- ఇన్‌స్టిట్యూట్‌కు ఆదాయం సమకూర్చుతున్న సెంటర్లు

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్ క్యాంపస్.. జాతీయ, అంతర్జాతీయ సమావేశాలు, సదస్సులకు వేదిక అవుతోంది. నిత్యం వివిధ ఆవిష్కరణలతో ప్రపంచ స్థాయిలో తన ప్రత్యేకత చాటుకున్న నిట్ వరంగల్‌లో కాన్ఫరెన్స్ హాల్ కాంప్లెక్స్‌తో పాటు అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఫలితంగా ఈ క్యాంపస్‌లో సదస్సులు, సమావేశాలు నిర్వహించుకుంటే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఔత్సాహికులు, వివిధ కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు. ఇక్కడే తమ సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. సెక్యూరిటీతో పాటు పూర్తిగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడిన ఏసీ కాన్ఫరెన్స్ హాల్స్, ఎల్‌ఈడీ ప్రొజెక్టర్, స్క్రీన్స్‌తో సెంటర్లను ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు.

ప్రత్యేకంగా కాన్ఫరెన్స్ హాల్ కాంప్లెక్స్..

నిట్ వరంగల్‌లో తమ విద్యార్థులకు సదస్సులు, సమావేశాలు నిర్వహించడంతో పాటు గెస్ట్ లెక్చర్స్ కోసం ప్రత్యేకంగా కాన్ఫరెన్స్ హాల్స్ ఏర్పాటు చేశారు. సైంటిస్టులు, స్వాతంత్ర్య ఉద్యమ సంగ్రామంలో పాల్గొన్న నాయకుల పేరిట కాన్ఫరెన్స్ హాల్ కాంప్లెక్స్‌తో పాటు రాజ్యాంగ నిర్మాత పేరిట అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు.

కాన్ఫరెన్స్ హాల్స్ ఇలా..

నిట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ కాంప్లెక్స్‌లో హోమీ బాబా హాల్, బోస్ హాల్, రామన్ హాల్, రామానుజన్ హాల్, ఖురానా హాల్, చంద్రశేఖర్ హాల్ ఉన్నాయి. ఇందులో హోమీబాబా హాల్, రామానుజన్ హాల్‌లో 125 మంది, ఖురానా హాల్ 90 మంది, బోస్ హాల్, రామన్ హాల్, చంద్రశేఖర్ హాల్‌లో 160 మంది, అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో 400 మంది, మరో ఆడిటోరియంలో వెయ్యి మంది కూర్చునే సామర్థ్యంతో సమావేశాలకు అనువుగా ఏర్పాటు చేశారు. అదే విధంగా నిట్‌లో ప్రతి డిపార్ట్‌మెంట్‌కు 80 నుంచి 120 మంది కూర్చునే సామర్థ్యంతో ప్రత్యేకంగా ఒక హాల్ ఉంటుంది.

ఆదాయ వనరుగా..

నిట్ వరంగల్‌లో ఏర్పాటు చేసిన సెమినార్ హాల్స్, అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియం ఆదాయ వనరుగా మారుతోంది. నిట్ తమ సమావేశాలతో పాటు బయట వ్యక్తులకు ప్రత్యేక రుసుముతో అవకాశం కల్పిస్తోంది. కాన్ఫరెన్స్ హాల్ కాంప్లెక్స్‌లోని హాల్స్‌కు ప్రతి సమావేశానికి రూ. 8 వేలు , అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియం రూ.15వేలకు అద్దెకు ఇస్తున్నారు.

చనిపోయిన వ్యక్తికి బుల్లెట్ బండి రుణం

రుణం కిస్తీ చెల్లించాలని మృతుడి ఇంటికి చేరుకున్న కలెక్షన్ మేనేజర్

- రుణం ఎప్పుడిచ్చారని నిలదీసిన మృతుడి కుటుంబ సభ్యులు
- వరంగల్ జిల్లాలో ఘటన




నందిగామలో ఉద్యోగులను నిలదీస్తున్న స్థానికులు



తన కుమారుడి ఫొటో చూపుతున్న తండ్రి నగేష్

నల్లబెల్లి: బ్యాంక్ రుణం కావాలంటే అధికారులు పలు షరతులు విధిస్తారు. అందుకు అవసరమైన పూర్తి డాకుమెంట్స్ అందించాలని కోరుతారు. ఆపై వెరిఫికేషన్ పూర్తి చేసి సంతృప్తి చెందిన తరువాతే రుణం మంజూరు చేస్తారు. కానీ అందుకు విరుద్ధంగా మృతి చెందిన వ్యక్తికి బుల్లెట్ (రాయల్ ఎన్‌ఫీల్డ్) బండికి ఖమ్మం బ్రాంచ్‌కి చెందిన కొటాక్ మహీంద్రా బ్యాంక్ రుణం మంజూరు చేసింది. వాయిదాలు చెల్లించాలని బ్యాంక్ అధికారులు ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. ఈ ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని నందిగామలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు, కలెక్షన్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ గ్రామానికి చెందిన భూక్య సునీత, నగేష్ దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు రాకేష్ 2022, జనవరి 23న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, కోటక్ మహేంద్రా బ్యాంక్ ఖమ్మం బ్రాంచ్ అధికారులు.. 2023 అక్టోబర్ 18న భూక్య రాకేష్ పేరుమీద రాయల్ ఎన్‌ఫీల్డ్–350 ద్విచక్ర వాహనానికి సుమారు రూ.3 లక్షల రుణం మంజూరు చేశారు. ఇందుకు రూ.7,150 చొప్పున 48 నెలలపాటు కిస్తీలు చెల్లించాలని ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు మూడు వాయిదాలు చెల్లించాడు. ఆ తరువాత వాయిదాలు చెల్లించకపోవడంతో రుణం రికవరీ కోసం కలెక్షన్ మేనేజర్ శ్రీనివాస్, వెరిఫికేషన్ ఏజెంట్ అరవింద్ నందిగామకు చేరుకున్నారు. వాయిదా బకాయి డబ్బులు చెల్లించాలని కోరారు. రెండున్నరేళ్ల క్రితం మృతిచెందిన తమ కుమారుడికి రుణం ఎలా ఇచ్చారని వారిని నిలదీశారు. తీసుకున్న వ్యక్తి వివరాలు తెలియజేసేవరకు ఇక్కడి నుంచి కదలనియ్యమని చుట్టుముట్టారు. రుణం తీసుకుని ఇలా ఎందుకు బుకాయిస్తున్నారని ఉద్యోగులు ప్రశ్నించగా, చనిపోయి రెండున్నరేళ్లు అవుతుందని చెప్పితే అర్థంకావడం లేదని స్థానికులు ఉద్యోగులను మందలించారు. పోలీసుల కు సమాచారం అందించి ఉద్యోగులను అప్పగించా రు. మృతిచెందిన తన కుమారుడి పేరిట రుణం మంజూరు చేసిన అధికారులు, తీసుకున్న వ్యక్తి, దళారులను గుర్తించి శిక్షించాలని పోలీసులను కోరా రు. కాగా, నర్సంపేటకు చెందిన ఓ వ్యక్తి.. చనిపోయిన రాకేష్ పేరు మీద తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇందులో బ్యాంక్ సిబ్బంది, దళారుల పాత్ర ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నిక ఓటింగ్ విధానంపై ఈసీ విడుదల చేసిన నమూనా బ్రోచర్



ఎమ్మెల్సీ ఓటు వేయండిలా..

రేపు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- బరిలో ఉన్న 52మంది అభ్యర్థులందరికీ ఓటు వేయొచ్చు
- '1'ప్రాధాన్యత అంకె ఇవ్వకుండా మిగతావి ఇస్తే ఆ ఓటు చెల్లదు
- అధికారి ఇచ్చిన పెన్నునే ఉపయోగించాలి



వరంగల్ డెస్క్: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ రేపు (సోమవారం) జరగనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 52 మంది అభ్యర్థులు ఉన్నారు. ఈ ఉప ఎన్నిక బ్యాలెట్ పేపర్ పద్ధతిన నిర్వహిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇతర సాధారణ ఎన్నికలకు ఓటు వేసే విధానంలో చాలా తేడా ఉంటుంది. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఓటు వేసే క్రమంలో ఈవీఎంలను వాడుతారు. ఆ ఎన్నికల్లో అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు ఉంటుంది. ఒకే అభ్యర్థికి ఓటు వేయాల్సి ఉంటుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అందుకు భిన్నంగా ఉంటాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరికీ ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేసే అవకాశం ఓటర్లకు ఉంటుంది.

ప్రాధాన్యతాక్రమంలోనే ఓటు..

- ప్రతీ ఓటరు బరిలో ఉన్న మొత్తం అభ్యర్థుల్లో ఒక్కరికి లేదా కొందరికి లేదా అందరికీ ఓటేయొచ్చు.
- అంకెలు మాత్రమే ఆ బాక్సులో ప్రాధాన్యతాక్రమంలో వేయాల్సి ఉంటుంది.
- మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తేనే ఆ ఓటు చెల్లుబాటు అవుతుంది.
- ఏ వ్యక్తికైతే మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తారో ఆ వ్యక్తి బ్యాలెట్ పేపర్ వరుసలో ఏ నంబర్‌లో ఉన్నా కూడా.. బాక్సులో 1 అనే అంకె వేయాల్సి ఉంటుంది.
- 1, 2, 3, 4, 5 ఇలా ప్రాధాన్యతాక్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థులకు ఓటు వేయాలి.

ఒక్కరికి కూడా ఓటేయొచ్చు

- పోటీలో ఎంత మంది అభ్యర్థులు ఉన్నా అందులో 40వ సీరియల్ నంబర్‌లో ఉన్న అభ్యర్థికి ఒక్కరికే ఓటు వేయాలంటే అతడికి ఎదురుగా ఉన్న బాక్సులో 1 అని ఓటు వేసి మిగతా వారికి వేయకున్నా ఆ ఓటు చెల్లుతుంది.
- 1వ నంబర్ ప్రాధాన్యత ఓటు వేయకుండా 2, 3, 4 నంబర్లతో ఓట్లేస్తే ఆ ఓటు చెల్లదు.
- తప్పనిసరిగా 1 నుంచి సీరియల్‌గా మాత్రమే ఓటు వేయాలి.
- ఒక అభ్యర్థికి ఒక అంకెను మాత్రమే వేయాలి.
- అంకెలను తెలుగులో కానీ, ఇంగ్లిష్‌లో, ఇతర భాషాల్లో వన్, టు, త్రీ అని పదాలు, అక్షరాల్లో రాయకూడదు.
- బ్యాలెట్ పేపర్‌పై ఎలాంటి సంతకాలు చేయకూడదు.
- వేలిముద్ర వేయకూడదు.
- అభ్యర్థికి ఎదురుగా ఉన్న బాక్సులో రైట్ గుర్తు, ఇంటు గుర్తు పెట్టకూడదు.

ఓటు వేసే విధానం..

- ప్రతి అభ్యర్థికి ఎదురుగా పార్టీ పేరు లేదా స్వతంత్ర అభ్యర్థి అని రాసి ఉంటుంది.
- పార్టీల గుర్తులు ఉండవు.
- అభ్యర్థి పేరు ఎదురుగా ఖాళీ బాక్స్ ఉంటుంది.
- పోలింగ్ అధికారి ఇచ్చిన పెన్నుతో మాత్రమే ఓటరు తన ఓటు వేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థి పేరు ఎదురుగా ఖాళీ బాక్స్‌లో పెన్నుతో కేవలం నంబర్ మాత్రమే వేయాల్సి ఉంటుంది.

సొంత పెన్నుతో ఓటు వేయొద్దు..

- బ్యాలెట్‌లో ఓటర్ ఓటు వేసేటప్పుడు సొంత పెన్నుతో ఓటు వేయొద్దు.
- అలా వేస్తే ఓటు చెల్లదు.
- ఒకరికి ఇచ్చిన ప్రాధాన్యత ఓటు మరో అభ్యర్థికి ఇచ్చినా ఆ ఓటు చెల్లదు.
- ఒకరికి 1వ నంబర్ వేసి దాన్ని పదేపదే దిద్దినా ఆ ఓటు చెల్లదు.
- బ్యాలెట్ పేపర్‌ను బాక్సులో వేయకుండా తీసుకెళ్తే కేసు నమోదు చేస్తారు.
- బాక్సు మధ్యలో మాత్రమే నంబర్ రాయాల్సి ఉంటుంది.
- రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఊదా రంగు స్కెచ్ పెన్నుతో గాక ఇతర ఏ పెన్నులతో రాసినా అది చెల్లుబాటు కాదు.
- ఏ అంకెలు వేయకుండా ఖాళీ బ్యాలెట్ పేపర్ ఇచ్చినా ఆ ఓటు చెల్లుబాటు కాదు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

■ HNK చౌరస్తా, మేన్‌రోడ్, BATA షోరూం ప్రక్క బిల్డింగ్‌లో 4th ఫ్లోర్ నందు 1 రూమ్ ఇద్దరు ఆడపిల్లలు లేదా ఇద్దరు మగ పిల్లలు లేదా చిన్న ఫ్యామిలీకి అన్ని వసతులతో కిరాయికి ఇవ్వబడును. సంప్ర: 9849881766. [W-1200893]

■ ఆటోనగర్ ప్రైమ్ లొకేషన్‌లో 2000 Sft షెడ్, పార్కింగ్, బోరింగ్ సౌకర్యంతో గోదాంలకు అనుకూలంగా గల కమర్షియల్ స్థలం కొరకు సంప్ర: 9573250030. [WA-5951]

LAND FOR LEASE

■ మడికొండ నుండి ఎల్కుర్తి, BT Road కు నేషనల్ హైవేకు దగ్గర ఉన్న 1.05 ఎకరాల ఓపెన్ ల్యాండ్ కాంపౌండ్ వాల్, 1 రూము ఉన్న ల్యాండ్ స్టాక్ యార్డ్స్, గోదాములకు, సర్వీస్ సెంటర్స్‌కు లీజుకు ఇవ్వబడును. సంప్ర॥ 7093873666. [W-1264896]

HOUSE FOR SALE

■ ప్రిన్స్ రియల్‌ఎస్టేట్: వరంగల్ గొర్రెకుంటలో కీర్తినగర్ ప్రక్కన, RTC కాలనీలో గల 130 గజాలలో రేకుల ఇల్లు అమ్మబడును. ధర కేవలం 16 లక్షలు మాత్రమే. కీర్తినగర్ కాలనీలో ఇల్లు అమ్మబడును. మావద్ద ప్లాట్లు అమ్మబడును. సెల్: 9989388603. [W-1242468]

■ WGL, కొత్తవాడ, లక్ష్మి గార్డెన్స్ దగ్గర 182 గజాల E/F ఇల్లు G.F 1 BHK + 2 BHK, 1st ఫ్లోర్ 2 BHK + 2 BHK, 2nd ఫ్లోర్ 1 BHK పార్కింగ్ G.F. కార్ @ 3 bikes, 1 బోర్, WMC వాటర్ # 9490421153, 9652979107. [M-11664]

PLOT FOR SALE

■ హన్మకొండ, భీమారంలో నియర్ ఔటర్ రింగ్‌రోడ్డుకు 200 చదరపు గజాల ఓపెన్ ప్లాటు అమ్మబడును. నియర్ రిజర్వాయర్. సంప్ర॥ 9849409821. [W-1264888]

■ About 250 Sq. Yards to 500 Sq. Yards Residential Plot For Sale. Near NIT, Beside Bishop Beretta School, FatimaNagar. Contact: Jayaraju: 9989635057, Praveen: 8008422520 [HA-13673]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

SERVICES

BUSINESS OFFER

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును. CIBIL అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. హన్మకొండ. సెల్: 8096520976. [WA-5708]

HEALTH CARE

■ ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషంట్స్ కొరకు అవసరమగు 24 గం॥ సేవలు అందించబడును. ✆ 6281476205, 9440325526 [M-11630]

WANTED

■ హనుమకొండ, లష్కర్‌బజార్, పబ్లిక్ గార్డెన్ దగ్గర ఉన్న HP పెట్రోల్‌బంక్ నందు పెట్రోల్, డీజిల్ క్యాషియర్ & ఫిల్లర్స్‌గా ఫిల్లింగ్ పని చేయుటకు యువతీ యువకులు కావలెను. (8గం./12గం./24గం.) సంప్ర: 9505919293. [W-1200892]

■ మావద్ద పని చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వయస్సు: 18–26 సం॥ లోపు వారు. చదువు అవసరం లేదు. ఉచిత వసతి. సెల్: 9849316058. [W-1242472]

■ డయాలసిస్ టెక్నీషియన్స్, OT టెక్నీషియన్స్, ఫార్మసీ బాయ్స్ & GNM నర్సులు అనుభవం గల వారు కావలెను. సంప్ర॥ గార్డియన్ హాస్పిటల్, ములుగు "X" రోడ్, వరంగల్ 12 to 2 PM. [WA-0385]

■ వరంగల్ స్టేషన్‌రోడ్డులో గల గోల్డెన్ లాడ్జిలో పని చేయుటకు మేనేజర్స్ (రిటైర్డ్ ఎంప్లాయిస్), రిసెప్షనిస్ట్ మరియు బాయ్స్ కావలెను. మంచి జీతం. సంప్ర॥ 9391864657. [W-1242456]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్ /వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185087]

■ మహబూబాబాద్ జిల్లాలో వేప పిండి, ఆముదం పిండి అమ్ముటకు అర్జంటుగా ఏజెంట్లు కావలెను. ఆర్గానిక్ ఆయిల్స్ సేల్స్ కొరకు ఏజెంట్లు కావలెను. 7842728053. [Y-798453]

■ షిర్డీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పని చేయుటకు లేడీ ఆఫీస్ అసిస్టెంట్స్, నర్సులు, లేడీ కేర్ టేకర్స్, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901. [HA-14041]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+ భోజనం. జీతం: 18 K. Ph: 9640258899, 9640468899. [H-799885]

WANTED TEACHERS

■ Wanted Lady Teachers (E/M) Pre-Primary All Subjects. 1st- 5th English, Hindi, Telugu. 6th-10th Maths & Social. Indian Kids High School, SVN Road, WGL. 9963006221. [W-1242469]

■ Wanted Exp. Teachers (M/F) Nursery -10th (E/M), Good Salary for Fluent English for all Subjects. ELOHIM SCHOOL, Kommala, WGL. 9390112329, 7702026999. [W-1242473]

■ V. Principal -2, 3rd-10th All Sub. Teachers, Incharges-2, Receptionists-4, Accounts-2, PET-6, Wardens (M/F) -10. # ISHS, Ambala Road, Near: Kits ✆ 9177039449. [W-1242408]

■ Pre-Primary Mother & Helping Teachers, 1 to X all subject Teachers are required. Space High School, Jawahar Colony, Gopalpur. Cell: 9177710222. [W-1242407]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'మేడిగడ్డ' బొరియతో బుగులు

- గేట్ల మరమ్మతులు ప్రారంభం
- ఇరురాష్ట్రాలకు రాకపోకలు బంద్



రాకపోకలు నిలిపివేస్తూ బ్యారేజీ గేట్ మూసివేసిన అధికారులు

కాళేశ్వరం: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ బ్యారేజీలో బొరియ పడడంతో నిర్మాణ సంస్థతో పాటు ఇరిగేషన్‌శాఖ అధికారులు బుగులు చెందుతున్నారు. బొరియ ఎక్కడి నుంచి.. ఎక్కడి వరకు ఉందనే విషయం అధికారులకు అంతుచిక్కడం లేదని తెలిసింది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. బ్యారేజీ నిర్వహణతో పాటు ఇరిగేషన్‌శాఖ ఇంజనీర్ల పనితీరుపై సీరియస్‌గా ఉన్నారు. త్వరలో సీఎంతో పాటు మంత్రులు రానుండడంతో మరమ్మతులు చేపట్టిన నేపథ్యంలో బ్యారేజీలోని 7వ బ్లాకులో 20 పియర్ ముందు పెద్ద బొరియ(గొయ్యి) ఏర్పడడంతో నిర్మాణసంస్థ, ఇరిగేషన్‌శాఖలు హుటాహుటినా ఆ ప్రాంతంలో మట్టి నింపారు.

మరో రెండు బ్లాకుల్లో కూడా బొరియలు?

7వ బ్లాకు పక్కన గల 8, 6వ బ్లాకుల్లో కూడా బొరియలు విస్తరించి ఉండొచ్చనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఫౌండేషన్ ఎలా ఉంది? బ్యారేజీ పొడవునా ఇలాగే ఉందా? అనే విషయంపై జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షల నిర్వహించడం ద్వారా పూర్తిగా తెలువనుంది. గ్రౌటింగ్ చేసి సుమారు 40వేల ఇసుక బస్తాలు వేశారు. ఇప్పటికే ఎన్‌డీఎస్‌ఏ ఏర్పాటు చేసిన చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ, మాజీ సుప్రీంకోర్టు జడ్జి పినాకి చంద్రఘోష్ టీమ్‌ల సూచనలతో వర్షాకాలంలోపు తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన విషయం తెలిసిందే. మూడు రోజుల క్రితం సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రిసెర్చ్ స్టేషన్(సీడబ్ల్యూపీఆర్‌ఎస్) టీమ్ బృందం పరిశీలన చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సందర్శించి తమ నివేదికలు అందజేయనుంది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద సీసీ బ్లాకుల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. 7వ బ్లాకులో మొరాయించిన గేట్ల నట్లు విప్పుతున్నారు. పూర్తిగా గేట్లను తొలగించిన తరువాత మరమ్మతులు చేయడానికి వీలవుతుందని తెలిసింది.

రాకపోకలు బంద్

మేడిగడ్డ బ్యారేజీలో బొరియ ఏర్పడడంతో మహారాష్ట్ర, తెలంగాణ మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గతేడాది బ్యారేజీ పియర్లు కుంగినప్పటికీ కనీసం టూవీలర్‌కు అనుమతిచ్చేది. శనివారం నుంచి గేట్లు వేసి ఎవరినీ అనుమతించడం లేదు. దీంతో రెండువైపులా వచ్చేవారు గంటతరబడి నిరీక్షించి వెళ్లిపోతున్నారు.

రైతు ప్రాణం తీసిన మొక్కజొన్న చొప్ప..



భగవాన్‌రెడ్డి(ఫైల్)

సంగెం: మొక్కజొన్న చొప్పు మంటలు ఆర్పుతున్న క్రమంలో ఊపిరాడక ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన సంగెం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కాట్రపలికి చెందిన గాయపు భగవాన్‌రెడ్డి(56)కి భార్య రమాదేవి, ముగ్గురు కూతుళ్లు దివ్య, శ్రుతి, మౌనిక, తల్లి సమ్మక్క ఉన్నారు. తనకున్న భూమిలో వ్యవసాయం చేస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం సాయంత్రం మొక్కజొన్న చొప్పకు నిప్పు పెట్టాడు. గాలి దుమారానికి పక్కన ఉన్న భాస్కర్‌రెడ్డికి చెందిన ఫామాయిల్ తోటలోని మొక్కజొన్న చొప్ప, డ్రిప్ పైపులకు మంటలు అంటుకున్నాయి. మంటలు ఆర్పేందుకు భగవాన్‌రెడ్డి తీవ్ర ప్రయత్రం చేశాడు. మోకాళ్ల నొప్పులు ఉండడంతో మంటలు, పొగనుంచి తప్పించుకోలేక ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం పక్క రైతు.. కుటుంబీకులు పోలీసులకు తెలిపారు. ఘటనా స్థలికి చేరుకున్న ఎస్సై నరేష్.. భగవాన్‌రెడ్డి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

● టీచర్ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి



యాదగిరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న రఘోత్తమ్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి

విద్యారణ్యపురి: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ, వరంగల్ జిల్లా పీఆర్‌టీయూ శాఖల ఆధ్వర్యంలో హనుమకొండలోని పీఆర్‌టీయూ భవనం వద్ద యూనియన్ టీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత సామల యాదగిరి వర్ధంతి కార్యక్రమంలో రఘోత్తమరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగియగానే నిలిచిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తిచేయిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రయోజనాలు నెరవేర్చేందుకు ఏ ప్రభుత్వమున్నా ఆ ప్రభుత్వంతో మమేకమై పనిచేసే అతిపెద్ద సంఘం పీఆర్‌టీయూ అని, దీనిని కాపాడుకోవాల్సి బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్, హనుమకొండజిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జనరల్ సెక్రటరీ ఫలితశ్రీహరి, వరంగల్ జిల్లాల అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శులు తిరునగరి శ్రీనివాస్, ఎడ్ల ఉపేందర్‌రెడ్డి, సామల పట్టాభి, కరీంనగర్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జాలిరాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబు బదిలీ

- కేయూ నుంచి ఆర్ట్స్ కాలేజీకి
- రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిపాలనా భవనంలో కీలకమైన టీచింగ్, నాన్‌టీచింగ్ విభాగాల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులను నిర్వర్తిస్తున్న పెండ్లి అశోక్‌బాబును బదిలీ చేస్తూ శనివారం రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. అశోక్‌బాబుకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌సైన్స్‌కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యింది.కేయూ వీసీగా తాటికొండ రమేశ్ హయాంలో అశోక్‌బాబు కీలకంగా వ్యవహరించడం, దీంతోపాటు యూనివర్సిటీ భూమిలో ఇల్లు ఉండటంతో భూ కబ్జాకు పాల్పడ్డాడనేది అకుట్ బాధ్యులతోపాటు వివిధ విద్యార్థి సంఘాలు కూడా ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. రమేశ్ పదవీకాలం ముగియడంతో అకుట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, ఇతర బాధ్యులు కూడా ఈ నెల 24న రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగారు. అశోక్‌బాబును సస్పెండ్ చేయాలని లేదా ఆసెక్షన్ నుంచి వేరే చోటుకు పంపాలని డిమాండ్ చేశారు. దీంతో శనివారం మల్లారెడ్డి హైదరాబాద్‌కు వెళ్లారు. ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణను కలిశారు. వీసీ అప్రూవల్ మేరకు అశోక్‌బాబును ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలకు బదిలీ చేశారు.

పరీక్షల విభాగానికి ఏఆర్ సరళాదేవి

ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కళాశాలలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్న జి సరళాదేవిని కాకతీయ యూనివర్సిటీలోని పరీక్షల విభాగం ఏఆర్‌గా బదిలీ చేశారు

టీచింగ్, నాన్‌టీచింగ్ విభాగ ఏఆర్‌గా ప్రణయ్‌కుమార్

యూనివర్సిటీ పరిపాలనాభవనంలో టీచింగ్, నాన్‌టీచింగ్ విభాగం ఇన్‌చార్జ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పరీక్షల విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీహెచ్ ప్రణయ్‌కుమార్‌ను బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు ఆ స్థానంలో అశోక్‌బాబు ఉండగా ప్రణయ్‌కుమార్‌కు ఇచ్చారు.